ప్రాణస్నేహితులు శత్రువులైతే..

ప్రభాస్ తాజా చిత్రం 'సలార్' ఈ నెల 22న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో హొంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సోమవారం 'సలార్' రిలీజ్ డేట్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఫిక్షనల్ సిటీ ఖాన్సార్ ప్రాంత నేపథ్యంలో జరిగే ఈ కథలో ఇద్దరు బాల్య స్నేహితులు..పెరిగి పెద్దయిన తర్వాత బద్ధ శత్రువులుగా ఎలా మారారనే వైనాన్ని ఆవిష్కరించారు.

అబ్బురపరిచే యాక్షన్ ఘట్టాలు, ఎమోషనల్ డైలాగ్స్, ఎక్స్‌ట్రార్డినరీ మేకింగ్‌తో ట్రైలర్ ఆకట్టుకుంది. రగ్గెడ్ లుక్‌లో ప్రభాస్ పవర్‌ఫుల్‌గా కనిపించారు. ఇప్పటికే విడుదలై ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, 'సలార్' ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ అనుభూతినందిస్తుందని నిర్మాత విజయ్ కిరంగదూర్ తెలిపారు. ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు, శృతిహాసన్ ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు.

ఈ దేశం గాంధీజీతో పాటు సుభాష్ చంద్రబోసది కూడా

వాస్తవ సంఘటన నుంచి ప్రేరణ పొంది తెలుగు, హిందీ భాషల్లో నిర్మించిన 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రంలో వరుణ్‌తేజ్, మానుషి చిల్లర్ జంటగా నటించారు. యాడ్ ఫిల్మ్ మేకర్‌గా, సినిమాటోగ్రాఫర్‌గా, విఎఫఎక్స్ నిపుణుడిగా పేరొందిన శక్తి ప్రతాపసింగ్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ది ఫస్ట్ స్ట్రైక్' పేరుతో టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో వరుణ్‌తేజ్ తన నటనతో, పవర్‌ఫుల్ డైలాగులతో ఆకట్టుకున్నారు. 'ఈ దేశం గాంధీజీతో పాటు సుభాష్ చంద్రబోసది కూడా' అని శత్రువులకు గుర్తు చేసే డైలాగ్ అలరించింది. వందేమాతరం నేపథ్య సంగీతం ప్రేక్షకుల్లో దేశభక్తిని రేకెత్తిస్తోంది. మన వైమానిక దళ హీరోల ధైర్య సాహసాలు, దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొనే సవాళ్ల నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 16న విడుదల కానుంది. ఈ చిత్రానికి సందీప్ ముద్దా నిర్మాత.

డెవిల్ దూరమై

నందమూరి కల్యాణ్‌రామ్ నటించిన పీరియాడిక్ డ్రామా 'డెవిల్' ఈ నెల 29న విడుదల కానుంది. బ్రిటీషర్లు ఇండియాను పరిపాలించిన కాలానికి సంబంధించిన కథతో రూపుదిద్దుకుంటున్న చిత్రం కావడంతో నాటి పరిస్థితుల్ని, వాతావరణాన్ని తెరపై ఆవిష్కరిస్తూ భారీగా చిత్రాన్ని నిర్మించారు దర్శకనిర్మాత అభిషేక్ నామా. ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని ఛేదించే బ్రిటీషు సీక్రెట్ ఏజెంట్‌గా కల్యాణ్‌రామ్ నటించారు. 'బింబిసార' చిత్రంతో బిగ్గెస్ట్ హిట్ సాధించిన ఆయన 'డెవిల్'తో మెప్పించడానికి రెడీ అవుతున్నారు. మాళవికా మోహనన్, సంయుక్తా మీనన్ ఈ చిత్ర కథానాయికలు. తాజాగా ఈ మూవీ నుంచి 'దూరమే తీరమై' అనే లిరికల్ వీడియో విడుదల చేశారు. సమీర భరద్వాజ్ ఈ పాట రాసి, పాడడం విశేషం. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ భాషల్లో 'డెవిల్'ను విడుదల చేస్తున్నారు.

బాలయ్యతో కలిసి చిందెయ్యనుందా?

కొన్నాళ్ల క్రితం కొంచెం కంట్రోల్‌లోనే ఉండేది తమన్నా. ఈ మధ్య మాత్రం సినిమాల్లోనూ సిరీసుల్లోనూ చెలరేగిపోయిమరీ అందాలు ఆరబోస్తున్నది. ఐటమ్ పాటల్లో తళుక్కున మెరుస్తూ సినిమాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది తమన్నా. మొన్నామధ్య రజనీకాంత్ 'జైలర్'లో 'రా నువ్ కావాలయ్యా.. కావాలీ..' అంటూ చేసిన హంగామాను అంత తేలిగ్గా మరిచిపోగలమా?. ఇప్పుడు అలాంటి హంగామాకే మళ్లీ తెరలేపిందట మిల్కీబ్యూటీ తమన్నా.

బాలకృష్ణ, కె.ఎస్.రవీంద్ర(బాబీ) కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రంలో ఓ ఐటమ్‌సాంగ్‌లో నటించటానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందట తమన్నా. ఆ పాట సినిమాకే హైలైట్‌గా నిలువనున్నదని టాక్. ఇదే గనక నిజమైతే బాలయ్యతో తమన్నా చేస్తున్న తొలి సినిమా ఇదే అవుతుంది. బాలయ్య రీసెంట్ హిట్ 'భగవంత్ కేసరి'లో కాజల్ కథానాయికగా నటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు తమన్నా వంతు వచ్చిందన్నమాట. అయితే హీరోయిన్‌గా కాదు, ఐటమ్ సాంగ్‌కి మాత్రమే అని టాక్. ఇందులో నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

విజయ్ దేవరకొండ నయా లుక్

పెళ్లి చూపులు సినిమాతో ఫ్యామిలీ ఆడియెన్స్‌తోపాటు యూత్‌కు బాగా కనెక్ట్ అయ్యాడు విజయ్ దేవరకొండ ఆ తర్వాత గీతగోవిందం, అర్జున్ రెడ్డి సినిమాలతో సూపర్ స్టార్‌డమ్ సంపాందించాడు. సినిమాలతో బిజీగా ఉంటూనే.. మరోవైపు బిజినెస్‌లో కూడా తనదైన స్టైల్‌లో ముందుకెళ్తున్నాడు. ఈ టాలెంటెడ్ యాక్టర్ లాంఛ్ చేసిన రౌడీ వేర్ (క్లాతింగ్ వేర్) ఎంత పాపులరో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

ఇటీవలే RWDY Club కొత్తగా లాంఛ్ చేసిన స్ట్రీట్ కలెక్షన్‌లో మెస్మరైజింగ్ లుక్‌లో మెరిశాడు. ఆరెంజ్ టీ షర్ట్ – బ్రౌన్ కార్గోస్ ప్యాంట్‌లో ఉన్న విజయ్ దేవరకొండ క్లీన్ అండ్ నీట్ లుక్‌తో కారులో కూర్చున్న ఫొటో ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. ఫ్యాషన్ ఐకాన్‌గా మారిపోయిన విజయ్ దేవరకొండ నయా లుక్ చూసి నెట్టింట తెగ షేర్ చేస్తున్నారు అభిమానులు, ఫాలోవర్లు, నెటిజన్లు.



ప్రేక్షకులు అలా అనుకొంటే చాలు..

'విజయం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి.. అందరూ గెలుస్తారని అనుకుంటారు.. వాళ్లే గెలుస్తారు. రెండు.. అందరూ గెలవరేమో అనుకుంటారు. వాళ్లూ గెలుస్తారు. ఈ రెండు రకాల విజయాలను 2023 నాకు ఇచ్చింది. ఒక స్టేడియం అంతా చీర్ చేస్తుంటే గెలవడం చూశాను. అదే స్టేడియం అంతా సైలెంట్‌గా ఉంటే గెలవడమూ చూశాను. ముఖ్యంగా 'హాయ్ నాన్న' వంటి అందమైన చిత్రంతో ఈ విజయం అందుకోవడం నాకు ఇంకా స్పెషల్' అన్నారు హీరో నాని. ఇటీవల జరిగిన 'హాయ్ నాన్న' చిత్రం సక్సెస్ మీట్‌లో ఆయన ఎంతో ఉద్వేగంతో మాట్లాడారు. 'బాక్సాఫీసు లెక్కలు, స్థానాలు, స్థాయిల గురించి మాట్లాడుతుంటారు కానీ నాకు మాత్రం శుక్రవారం సినిమా విడుదలైతే 'నాని సినిమాకి వెళ్దాం రా' అని ప్రేక్షకులు అనుకుంటే అదే గొప్ప స్థాయిగా ఫీల్ అవుతాను. దానికి మించిన స్థాయి ప్రపంచంలో మరేదీ లేదని నమ్ముతాను. ఆ స్థాయినీ, స్థానాన్నీ కాపాడుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటాను' అన్నారు. చిత్ర దర్శకుడు శౌర్యువ్ మాట్లాడుతూ 'నానిగారు ఈ కథని నా కోసం, తెలుగు సినిమా కోసం ఎంపిక చేసుకున్నారని భావిస్తున్నాను. ఆయన వల్లే ఇంత విజయం సాధ్యమైంది. మృణాల్ ఈ సినిమాను బలంగా నమ్మారు. యష్ట పాత్రతో ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేశారు. బేబి కియారా వండర్ కిడ్. చాలా చక్కగా నటించింది' అన్నారు. చిత్ర నిర్మాత డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల మాట్లాడుతూ 'శౌర్య కథ చెప్పినప్పుడే చాలా ఎమోషనల్‌గా ఫీల్ అయ్యా. నానిగారు ఫస్ట్ సిట్టింగ్‌లోనే కథ ఓకే చేశారు. 'హాయ్ నాన్న' ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోయే చిత్రం' అన్నారు.